# వెలుగు రేఖ

రన్‌వే అంతా గడిచి, తర్వాత నెమ్మదిగా గాలిలోకి లేచి, వేగం పుంజు కుంటూనే ఇంకా ఎత్తుగా వెళ్ళిపోతూ, క్రమేపి కంటికి కనిపించనంత చిన్నదై, చివరికి కనుమరుగై పోయింది బోయింగ్ విమానం.

"కొడుకు దూరంగా వెళ్ళిపోతున్నాడు. మళ్ళీ ఎన్నాళ్ళకి కనిపిస్తాడో" అన్న బెంగలో గుండె కుదిపి నట్లయి, బాధని ఆపుకోలేక ఏడ్చేసింది సత్తెమ్మ.

"ఎందుకే వెర్రిదానా ఏడుస్తావు? రెండేళ్ళలో మన సూర్యం మనకి తిరిగిరాడూ? ఏం అమ్మాయీ? అంతే కదూ? రెండేళ్ళు" అంటూ సోవన్న తెచ్చి పెట్టుకున్న ధైర్యంతో సరోజకేసి తిరిగి అడిగాడు. పైకి అయితే గంభీరంగానే ఉన్నాడు కాని, అతని కళ్ళుకూడా నీళ్ళతో నిండే ఉన్నాయి. కంఠం సరే సరి. వణుకుతూ ఉంది.

నిజానికి సరోజకు కూడా దుఃఖం ఆగేలా లేదు. రెండేళ్ళదాకా భర్త తిరిగి కనిపించడనే బెంగ గుండె నిండా నిండిపోయి, నోట మాట వచ్చేలా లేదు. ఓదార్చేవాళ్ళుంటే వాళ్ళ భుజం మీద తలపెట్టి ఎక్కెక్కి ఏడ్చేసి ఉండును.

కానీ ఇప్పుడు అలాంటివాళ్లు లేకపోగా, తనే వాళ్ళిద్దరినీ ఓదార్చవలసిన అవసరం ఉంది. అత్తా, మామా ఒట్టి అమాయకులు. లోకం సంగతీ, పెద్ద చదువులూ, విదేశ ప్రయాణాలూ ఇవేవీ అసలు తెలియని వాళ్లు. పాపం పల్లె విడిచి ఎప్పుడూ బయటికి రానివాళ్లు. అందుకే సూర్యం అన్ని మార్లు మరిమరీ చెప్పి 'ఇంక మా అమ్మకీ, నాన్నకీ నువ్వే ఉన్నావు. ఎలా చూసుకుంటావో ఏమో" అంటూ ముసలి వాళ్ళను ఇద్దరినీ తనకి అప్పగించి మరీ విమానం ఎక్కాడు.

"వాళ్ళ సంగతి మీరేం ఆలోచించకండి. మా అమ్మా, నాన్నకంటే కూడ ఎక్కువగా చూసుకుంటాను. సరా? మీరు వెళ్ళిరండి అంటూ తను మాట ఇచ్చాక అతనికి ధైర్యం వచ్చింది. నవ్వుతూ చెయ్యి వూపి లోపలికి వెళ్ళాడు.

భర్త నవ్వు ముఖము జ్ఞాపకం వచ్చేసరికి సరోజ ముఖం ఇంతయింది. అసలు అతని స్వచ్ఛమైన ఆ నవ్వే తనని బందీ చేసి అతని దాన్ని చేసింది. తెలివికి తెలివీ, మంచి తనానికి మంచితనం, అందానికి అందం అన్నీ ఉన్నాయి కనకే సూర్యం తన మనస్సుని ఆకట్టుకున్నాడు. అందుకే అతను తన కులం కాకపోయినా, అతని స్థితిగతులు ఎటువంటివి అయినా అవేం లక్ష్యపెట్టకుండా తన జీవితాన్ని అతనితో ముడి వేసుకుంది. డబ్బు ఉండవచ్చు. అంతస్థు ఉండవచ్చు కాని ఇటువంటి అమృత హృదయుడు ఎక్కడ

దొరుకుతాడు తనకి? అతను సరే. ఇటువంటి అత్తమామలు మాత్రం? పసివాళ్ళటు, వీళ్ళిటు—

అంత దిగులులోనూ, సత్తెమ్మకేసి, సోవన్నకేసీ చూసి నవ్వుకుంది సరోజ. నవ్వుకుని "మరైతే ఇంక వెళదామా?" అంది. ముగ్గురూ ఎయిర్‌పోర్ట్ బయట లాక్‌చేసి ఉన్న కారు దగ్గరికి వచ్చారు. సరోజ స్టీరింగ్ దగ్గర కూర్చుంది. గుండెల్లో కొండంత బెంగతో సత్తెమ్మ సోవన్నా వచ్చి వెనక సీట్లో కూర్చున్నారు. ముగ్గురి మనస్సులలోనూ దిగులే - ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు.

కారు మెత్తగా ముందుకు పోతూంది.

ముగ్గురి ఆలోచనలూ మాత్రం గతంలోకే మరలుతున్నాయి.

సత్తెమ్మకి ఆ రోజు బాగా గుర్తు.

ఆ రోజు తను అన్నం కుండ వార్చి మళ్ళీ పొయ్యి మీద పెడుతూంది, 'ఉమ్మగిలి పొడిపొడిగా ఉండక పోతే వాడు తినలేడు' అనుకుంటూ. అలాంటప్పుడు పరుగు పరుగున లోపలికి వచ్చాడు సూర్యం. ముఖంలో కొండంత వెలుతురు.

'అమ్మా! నేను ఫస్ట్‌క్లాస్‌లో పేసయ్యాను" అన్నాడు పట్టలేని ఆనందంతో.

'అలాగ[టా' అంటూ తను బుగ్గలు నొక్కుకుంది, అదేంటో అర్థం గాక తెల్లబోతూ.

"అంటేఏంటి రా అబ్బీ!' అన్నాడు వాళ్ళ అబ్బ చుట్టుకుంటూన్న చుట్టని ఆపేసి.

"ఎలా చెబితే తెలుస్తుందబ్బా' అనుకొని తల గోక్కొని, "అంటే, మా కాలేజీలో ఇంటర్ చదువుతున్న వాళ్ళందరి కంటే నేను ఎక్కువన్న మాట" అన్నాడు సూర్యం వచ్చీరాని మీసం మీద చెయ్యేసుకుంటూ.

"సెత్ వూరుకో. పెద్ద పెద్ద కులాల వాళ్ళు ఎంత మందో ఉండగా నువ్వెలా ఎక్కువవుతావు?" అన్నాడు అళ్ళయ్య.

"కులం కాదయ్యా.... మార్కులు" అన్నాడు సూర్యం.

"అంటే? .. అవేంటి? ... ఎందుకు?" అంది తను.

"అవి ఉంటే పెద్ద చదువులు చదవవచ్చు. బోలెడు డబ్బు సంపాదించవచ్చు, అయ్యనీ నిన్ను ఒక మేడ కట్టి అందులో కూర్చోబెట్టొచ్చు" అన్నాడు సూర్యం.

"అద్గదీ....విన్నావా ముసలాయనా?" అంది తను అతగాడికేసి గర్వంగా చూస్తూ.

"అదే లేవే! నాకంతా అర్థమై పోయింది. నీది వట్టి మట్టి బుర్ర కాని....పెద్ద, సదువు సదువుతాడు మనోడు.... అంతే కదర్రా.

"పెద్ద సదువులికి మన దగ్గర డబ్బు ఎక్కడుంది. పైగా ఆటికోసం పట్నం పోవాల. అవేంవొద్దు కాని. మీ అయ్య కరణంగారి కాళ్ళట్టుకుని ఏదో నౌకరి ఇప్పిస్తాడు, నువ్వు మా కళ్ళ ఎదుటే ఉండు" అంది తను....

"కాదమ్మా — గవర్నమెంటే డబ్బిస్తుంది. తిండీ, పుస్తకాలు అన్నీ అదే చూస్తుంది. మనకి ఒక్క కానీ ఖర్చుండదు. మీరిద్దరూ 'ఊఁ' అనండి-చాలు. అదంతా నేను చూసుకుంటాను." అంటూ ఏదేదో చెప్పాడు సూర్యం.

అప్పుడూ తనకి ఇలాగే-గుండెలు బెంగతో బరువెక్కి పోయాయి. అయ్యా, అమ్మా ఒక చోటా-పిల్లాడు ఒక చోటా -ఏం సదువో ఏమో.

'ప్చ్' అంటూ నిట్టూర్చింది సత్తెమ్మ.

అత్తగారి నిట్టూర్పు విని ఉలిక్కిపడి వెనక్కి ఒక మారు తిరిగి చూసి మళ్ళీ స్టీరింగు మీదకు దృష్టి మరల్చింది సరోజ. చేతిలో స్టీరింగులాగే, మనస్సులో ఏవేవో జరిగిపోయిన సంఘటనలు, గుండ్రంగా తిరుగుతున్నాయి.

"పాఠం చెబుతూంటే శ్రద్ధగా వినరు. సగంమంది క్లాసుకి గైరుహాజరు. తక్కిన సగం మందీ అటూ ఇటూ దిక్కులుచూడ్డం. మీలో ఒకళ్ళుకూడా డాక్టర్లు కాదు కదా కాంపౌండరుగానైనా పనికిరారు" అంటూ ఎనాటమీ ప్రొఫెసర్ మొత్తం క్లాసునంతనీ తలవాచేటట్లు చీవాట్లు పెడుతూంటే ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా తలలు వంచుకుని కూర్చున్నారు. ప్రతివాళ్ళకి, ఆఖరికి లేడీస్‌కూడా లేచి సమాధానం చెప్పాలని ఉంది కాని ఎవ్వరూ లేవలేదు.

అ సమయంలో "ఎక్స్‌క్యూజు మీ" అంటూ వెనక వరసలోంచి సూర్యంలేచి నుంచున్నాడు. క్లాసు క్లాసంతా వెనక్కి విరగబడి చూసింది. ఆశ్చర్యంగా సూర్యంకేసి తనూ చూసింది. సూర్యం ముఖం గంభీరంగా ఉంది. కళ్ళల్లో చారవా ధైర్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. బాగా ఆరడుగుల మనిషేమో, దృఢంగా లేచి నిలబడే టప్పటికి, హుందాగా ఆకర్షణీయంగా ఉన్నాడు. ఈ మూడు నాలుగేళ్ళలోనూ తను ఆతణ్ణి చాలాసార్లే చూసింది. ఎప్పుడూ ఏదో పుస్తకం పుచ్చుకుని చదువుకుంటూ వుండడం, ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడక పోవడం, లేడీస్ ఎవరైనా పలకరిస్తే ఏదో ఇబ్బందిగా నిలబడి ముక్తసరిగా మాట్లాడి గబగబా వెళ్ళిపోవడం, ఇదీ ఆతని తత్వం – "పుస్తకాల పురుగు" అని విద్యార్థులూ, "వట్టి వెదురు గొడ్డు" అని విద్యార్థినులూ

అతనికి పేర్లు పెట్టి నవ్వుకోవడం తాను ఎన్నోమార్లు చూసింది. వింది. తనూ నవ్వింది ఒకటి రెండుసార్లు వాళ్లతో కలిసి. అటువంటి సూర్యం ఆరోజు అందరికీ భిన్నంగా కనిపించాడు. "అందరి పాఠాలు శ్రద్ధగా వింటున్నవాళ్ళం. మీ ఒక్కరి పాఠం వినక పోడానికి కారణం ఏమిటి?....ఎప్పుడైనా మీరు మా ముఖాలకేసిచూసి పాఠం చెప్పారా?.... తలవంచుకుని మీలో మీరు ఏదో చెప్పుకుంటూంటే మాకేం ఆసక్తి ఉంటుంది? పైగా మీరు ప్రతి క్లాసులోనూ స్టూడెంట్స్ని అవమానపరచడం" అంటూ సూర్యం అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడి చివరికి ఆ ఎనాటమీ ప్రొఫెసరుచేత 'సారీ' అనిపించేసరికి అందరూ అతన్ని అభినందించారు.- 'మా మనస్సులో ఉన్నది నువ్వు ధైర్యంగా చెప్పగలిగావు' అంటూ. తను సరేసరి అతని నుంచి దృష్టిని మరల్చుకోనే లేకపోయింది ఆనాటినుంచీ.

తరవాత ఎన్నిసార్లో ఏదో ఒక వంక పెట్టుకుని అతణ్ణి కలుసుకుంటూ వచ్చింది. కావాలని తనతో అతనికి ఏకాంతాన్ని కూడా కల్పించింది. పూర్వపు బెదురూ, భయం, సంకోచం ఏమీ లేకుండా అతనిప్పుడు తనతో స్వేచ్ఛగానూ మాట్లాడుతున్నాడు. తనుకూడా అతనికి విపరీతమైన చనువు ఇచ్చింది. స్నేహం బలపడి ఆత్మీయతగా మారుతోంది. ఇద్దరూ ఎంతో దగ్గరవుతున్నారు. ఎంత దగ్గర అయినా, ఎంత చనువు ఏర్పడినా, అతనుమాత్రం తనతో నాగరికమైన హద్దులు దాటి ప్రవర్తించడంలేదు. నలుగురుమధ్య ఉన్న

ప్పుడు సరే-తామిద్దరే ఉన్నప్పుడు కూడా ఆతను ఆ హద్దుని పాటిస్తున్నాడు ఏమిటి ఇతని పద్ధతి? మరో స్టూడెంట్ ఎవరైనా అయితే ఈ పాటికి ఎంత అలుసు తీసుకొని ఉండును? ఆతనే చొరవ తీసుకుంటా డేమోనని ఏడాదివేచి చూసింది తను ఊహు!.... లాభంలేదు.... ఈ వ్యవహారం ఏదో తనే తేల్చాలి. సిగ్గుపడి వూరుకుంటే అవకాశం చెయ్యి జారి పోయేలా ఉంది. ఒక రోజున తటపటాయించి చివరికి ధైర్యంచేసి అడిగేసింది- "మన స్నేహాన్ని వివాహం అనే బంధంతో శాశ్వతం చెయ్యడానికి మీకు అభ్యంతరం ఏమిటి?" అని.

ఆమాటవిని సూర్యం మొదట ఉలిక్కిపడ్డాడు. చాలా సేపు సమాధానం ఏమీ చెప్పకుండా మవునంగా వూరు కున్నాడు. తర్వాత తలవంచుకొని నేలకేసి చూస్తూ "అది జరిగే పనికాదు సరోజా. నేనూ, మా కుటుంబం, మా ఆర్థిక పరిస్థితులూ నీకేం తెలియవు. ఇక్కడ నన్నుచూసి మా ఇంటినీ, మాతల్లి దండ్రుల్నీ వూహించుకోకు. నీకూ, నాకూ పగటికీ-రాత్రికీ ఉన్నంత భేదం ఉంది" అన్నాడు బాధగా.

"నేను నీమీద మనస్సు పెట్టుకున్నది అవన్నీచూసి కాదు. నిన్నుచూసి" అంది తను, అతని కళ్ళల్లోకి చూస్తూ.

"మా అమ్మకీ, నాన్నకీ చదువుమాట అలాఉంచు. మనలాంటి వాళ్ళతోటి సరిగ్గా మాట్లాడటమే చేతకాదు. అది సరే-ఇంక దుర్గంధంతో నిండిన ఒక గూడెం మధ్య మాదో

పూరి గుడిసె. కాపురంమాట అలా ఉంచు, నీలాంటి వాళ్ళు ఒక్క క్షణం నిల్చోలేరు కూడా అక్కడ. పైగా మానాన్న వృత్తి ఏవిటో తెలుసా? నులకమంచాలు నెయ్యడం."

అతని మాటలు వింటూంటే తనకి నవ్వు వచ్చింది చదువురాదు నులక మంచాలు నేస్తారంటే అర్థం, లోకానికి సంబంధించిన నాటకాలూ మోసాలు తెలియని స్వచ్ఛమైన మనస్సులు అన్నమాట. స్వతంత్రి జీవనం చేస్తున్న మనుషు అన్నమాట-ఇక గుడిసెలూ దుర్గంధమూనా? తనూ సూర్యం ప్రాక్టీసు పెడితే వాళ్ళని అక్కడెందుకు వదిలేస్తారూ? తీసు కొచ్చి తమ దగ్గరే అట్టే పెట్టుకుంటారు. అందువల్ల మనుషులూ మనస్సులూ మమతలూ ఇవి ముఖ్యం కాని, ఈ నాగరికతలూ ఈ సంపదలూనా?

ఇలా సాగిన తన ఆలోచనల్ని సూర్యానికి చెప్పింది.

"అయినా సరే- నువ్వో నిర్ణయానికి రావడానికి ముందు మా ఇంటికొచ్చి, అక్కడి పరిస్థితుల్ని మా అమ్మని నాన్ననీ ఒక మాటు చూడు. అప్పటికీ నీమనస్సు మారకుండా నా మీదే ఉంటే, అప్పుడు నిర్ణయిద్దాం మన పెళ్ళి సంగతి" అన్నాడు సూర్యం అంతవరకూ వీల్లేదు అన్నట్లు ధ్వనిస్తూ.

"ఓ ఎస్.... అలాగే చేద్దాం.... అక్కడి పరస్థితులు ఎలా ఉన్నా నాలో మార్పురాదు- చూస్తావుగా?" అంది తను నవ్వుతూ.

కథా నిలయం
3736
శ్రీకాకుళం



"సరే–అయితే కానియ్యి" అన్నాడు సూర్యం చిన్నగా నవ్వి. శ్రుతి కలిసినట్లు కలిసి పోయిన ఆనాటి ఇద్దరి నవ్వుల్నీ జ్ఞాపకం తెచ్చుకుంటే ఇప్పటికీ ఒళ్లుపులకిస్తుంది అనుకుంటూ మళ్ళీ తనలో తను ఒకమారు నవ్వుకొని, స్టీరింగ్‌దగ్గర కొద్దిగా ఇటూ అటూ కదిలింది సరోజ.

సత్తెమ్మ సరోజలలాగే, సోవన్న ఆలోచనలకూడా గతంలోకే పరుగెత్తున్నాయి.

ఆ రోజు తను వూరంతా తిరిగాడు. ఎక్కడాపని దొరకలేదు. ఒకళ్ళిద్దరైతే "ఏంట్రా ముసలాడా! ఇంకా నులక మంచాలు, నులక మంచాలు అంటూ అరుస్తావు. నులక మంచాలు ఎవరు నేయించు కుంటున్నార్రా? ఈరోజుల్లో వైరు మంచాలు అల్లించు కుంటున్నారు. తప్పితే చెక్క మంచాలు కొనుక్కుంటున్నారు.– వెళ్ళిరా" అంటూ వేళాకోళంచేశారు ప్రాణం ఉసూరుమంది. రూపాయో, అర్థో ఇంటికి పట్టి కెళ్ళితే కదా అది గంజి అయినా కాచేది? ఉత్తచేతులు వూపుకుంటూ వెళ్ళితే అదిమాత్రం ఏం చేస్తుంది? ఈయాళ వస్తే–'పోనీ అని కొత్తగా ఎవరి దగ్గరైనా వైరుమంచాలు అల్లడం నేర్చుకో కూడదూ' అంటూ ముసల్ది ఒకటి రెండు సార్లు తనతో అంది. ఎర్రిమొకం దానికేం తెలుసు ఇందులో ఉన్న తిరకాసు?... కన్నీ మధ్య సరిగ్గా ఆనడంలేదు. నులక మంచం అయితే అలవాటయిన చెయ్యి కనక అల్లేస్తుంది. మళ్ళీ ఆవైరుమంచం అంటే అది ఎలాగ?

ఏవిటో – ఆ సూరిగాడు చదువు అంటూ పట్నం పోయాడు కాని, ఉన్నకాడ ఉండి, చక్కగా వైరుమంచాలు అల్లడం నేర్చుంటేనా, ఇంట్లో అంతా డబ్బేకదా! ఇలా ఆలోచించుకుంటూ గుడిసె దగ్గరికి వెళ్ళేసరికి తడక దగ్గరగా ఏసి, తాడుముడెట్టి ఉంది, ఎక్కడికి పోయింది ముసిల్ది? ఎప్పుడూ గుడిసె దాటి బయటికి ఎల్లదే. అనుకుంటూ ఇవతల ఉన్న నులకమంచం వాల్చి దానిమీద కూలబడ్డాడు తను.

చీకటడుతోందనగా వచ్చింది. ముకం అంతా నీరసంగా పీక్కుపోయి ఉంది. కట్టుకున్న చీర మీద అక్కడక్కడ బురద పడి అసయ్యంగా ఉంది. "ఏందిలా ఉన్నావు? ఎక్కడికి ఎల్లావు?" అని అడిగితే, "ఏం చెయ్యమంటావు? నీకా పని దొరకటం లేదు. ఎన్ని పూటలని తిండిలేకుండా మాడిపోవడం? అందుకని పక్కింటి లచ్చమ్మతో కలిసి నాట్లకి ఎల్లాను. రెండు రూపాయల వచ్చాయి. అంటూ ఎర్రగా ఉన్న రెండు రూపాయల నోటు చూపించింది.

తనకి పేణం కటకట లాడింది. ఎప్పుడూ రెక్కవిరుచు కోంది ఇయాల ఇలా కష్టపడిందే అని. ఎంటనే తనకి కోపం వచ్చింది. దీనికంతకీ కారణం వాడే! ఆ సూరిగాడు. వాడే ఇంటి పట్టున ఉండి వైరు మంచాలు అల్లడం నేర్చుకుంటే మనకి కష్టంలేక పోను రానీ.... "ఈ మారు పట్నంనుంచి రాగానే, మళ్ళీ పట్నం ఎల్లను అనే దాకా నిట్రాడికి తాడేసి కట్టి సితక్కొడతాను" అన్నాడు తను

ఎంటనే అది తన మీద మీదకివచ్చి- "ఏంటి? అణ్ణి కొడతావా? ఆడిమీద సెయ్యి సేసుకుంటే ఒట్టే - ఇదిగో ముసలయ్యోయ్! నాసేతికూడు తినాలని ఉంటే ఆపని సెయ్యమాక....ఆ!" అంటూ చెంగుతో కళ్ళు ఒత్తుకుంది. "అది రాదే ఎర్రి మొకమా?" అంటూ ఏవో చెప్పబోయాడు తను.

ఇంతలో కారు ఒకటివచ్చి ఆగింది గుడిసెముందు. తానూ, ముసల్ది అదిరిపడి అటు చూశారు. ఖరీదైన ఆ కారు లోంచి ముందు సూర్యం, తరవాత ఎవరో గొప్పింటోళ్ళ బిడ్డ, ఖరీదైన బట్టల్లో మిలమిల దేవతలాగ మెరిసిపోతూన్న నాజూకైన పిల్ల, ఇరవై ఇరవై రెండేళ్ళు ఉన్న అమ్మాయి దిగారు. ఆ అమ్మాయి సరసన సూర్యంకూడా మెరుస్తూనే కనిపించాడు. తమూ ముసల్ది కళ్ళు అప్పగించి చూస్తున్నారు.

"ఇదిగో వీళ్ళిద్దరూ అమ్మా, నాన్నా! ఇదీ మా ఇల్లు" అనీ సూర్యం చూపించగానే ఆ అమ్మాయి చిన్నగా నవ్వుతూ దణ్ణం పెట్టింది " తనకీ ముసల్దానికీను. ఇద్దరూ కంగారుగా లేచి నుంచోబోయారు. 'మీరు కూచోండి లేవకండి బాగుందండి మీ ఇల్లు నాకు నచ్చింది హాయిగా ఉంది. మంచి మనసులు దొరకాలి కాని, ఆస్తుల కేముందండీ. ఇవాళ ఉంటాయి రేపు పోతాయి' అంటూన్న ఆ అమ్మాయి మాటలు అర్థంకాక, "ఏంటాఁ ఇదంతా?" అన్నాడు తను. ఆ అమ్మాయి ముక్కాలిపేట లాక్కుని ముసల్దాన్ని పక్కని కూచుంది.

'ఈ పట్నం అమ్మాయికి తాగడానికి ఏవేనా ఇవ్వవే" అన్నాడు సూర్యం. తనూ ముసల్దీ మొహ మొహాలు చూసుకున్నారు. తరవాత లేచి పక్కనున్న లచమ్మ పిన్ని గుడిసె కెళ్ళి బియ్యంమీద తెర్లి తెర్లి ఉడుకుతూన్న నీళ్ళు తెచ్చిందిముసల్ది. 'అవి నువ్వు తాగలేవు.' అని సూర్యం అంటూనే ఉన్నాడు. "ఇది వంటికి మంచిది" అంటూ ఆ అమ్మాయి ఆప్యాయంగా వూదుకుని వూదుకుని తాగ సాగింది.

"ఎవర్రా ఈ పిల్ల?" అంది ముసల్ది. సూర్యం ఏదో చెప్పబోయాడు "నేను చెబుతా ఉండండి" అంటూ ఆబుల్లి ముసల్దాని దగ్గరికి మరింత జరిగి అత్తమ్మా .... మీరు మావయ్యా ఒప్పుకుంటే, నేను మీ అబ్బాయి మనువు ఆడతాం అంది సిగ్గుపడుతూ.

ఆఁ, అన్నారు తనూ ముసల్ది నోళ్ళు తెరచి.

ఇద్దరిక్కీ మతులు పోయాయి. ఏం అనాలో తోచలేదు.

"గొప్పింటి బిడ్డవి. పైగా డబ్బున్న పిల్లలా ఉన్నావు. మరి "

"ఆ మాటలు అనకండి మావయ్యా. మీ అబ్బాయి పెద్ద ఉద్యోగంచేసి బోలెడు డబ్బు సంపాదిస్తే మీరుమాత్రం డబ్బున్న వాళ్ళు కారేమిటి? అయినా అంతా పుట్టడంతోటే డబ్బున్న వాళ్ళు అవుతారా?" అంది ఆ పిల్ల నెమ్మదిగా.

లచ్చలకి ఇలువైన మాట.

"నీ పేరేవిటి అన్నావు?" అంది ముసల్ది.

సరోజ.

"తల్లీ ఆడిష్టం. నీ ఇష్టం. కానయితే, కాలం తీరే రోజుల్లో ఆ ముసలాడికి, నాకూ కాసిని గొంతులో నీళ్ళు పోస్తే చాలు." అంది బాధతో ముసల్ది. ముగ్గురూ తనకేసి చూశారు. తనూ తలూపాడు. అంతే ఆ రోజునే తనూ ముసల్దీ గుడిసె వదల్లేక వదల్లేక లేచారు.

నలుగురూ కారెక్కి పట్నం వచ్చేశారు.... కారు ఒక్క కుదుపు కుదిపి ఆగే సరికి సోవన్న ఆలోచనలుకూడా టక్కున ఆగిపోయాయి ...

ఆ రాత్రి సూర్యం విదేశాలు వెళ్లాడన్న బెంగతో ముగ్గురికీ చాలా పొద్దుపోయేదాకా నిద్ర పట్టలేదు. ఇంకో మూడు నాలుగు నెలల్లో పుట్టబోయే మనవణ్ణి తమకి అప్పగించి సరోజ కూడ విదేశం వెళ్ళి చదువుకుంటుంది అనే ఆలోచనతో అసలే నిద్రపట్టలేదు సత్తెమ్మకి సోవన్నకీ.... తెల్లవారుతుండగా కాస్త పట్టిందేమో కునుకు....

ఘొల్లుమని సరోజ ఒక్కమారు ఏడ్చేసరికి పాము కరిచినట్లు సత్తెమ్మా, సోవన్న ఒక్కమారు ఉలిక్కిపడి

లేచారు. "మన ముగ్గుర్నీ అన్యాయం చేసేసి ఆయన వెళ్ళిపోయారు" అంటూ ఒక్క అరుపు అరిచి సరోజ స్పృహ తప్పి పడిపోయింది - రేడియోలో విమానం కూలిపోయిన వార్తలు చెబుతున్నాడు. సత్తెమ్మకి సోవన్నకి సగం అర్థం అయింది సగం అర్థం కాలేదు. పూర్తిగా అర్థం అయేసరికి కుప్పగా కూలిపోయారు. కొండలా వచ్చి మీదపడ్డ ఆ కష్టానికి ఆ ముసలి ప్రాణాలు రెండూ తట్టుకోలేక పోయాయి. వెన్నెముక విరిగిపోయింది. తమ బ్రతుకే బండలయి పోయింది. నేలమీద దొర్లి దొర్లి ఏడ్చారు. ఎంతపని జరిగింది రా దేవుడా - అంటూ గుండెపగిలేలా రోజల్లా ఏడ్చారు. లోకం అంతాశూన్యం అసలు బ్రతుకే శూన్యం అయిపోయింది ముగ్గురికీ....

మర్నాడు పొద్దుట ఏడుస్తూ బట్టలు మూట కట్టుకుని బయలుదేరబోతూన్న సత్తెమ్మనీ సోవన్ననీ చూసి, శోక దేవతలావచ్చి వాళ్ళ కాళ్ళని చుట్టేసి ఏమిటది? అంది సరోజ.

"ఇంకా మాకేం ఉంది అమ్మా ఈ పట్నంలో? రత్నం లాంటి కొడుకుని మింగేసుకున్న ఈ దరిద్రపు బ్రతుకులు దరిద్రంగానే వెళ్ళిపోవాలి...." అన్నారు సత్తెమ్మ సోవన్నాను.

"ఆయన విమానం ఎక్కేటప్పుడు మిమ్మల్ని నాకు అప్పగించి వెళ్ళారు. పైగా మీరు అడిగారు, కాలం తీరే రోజుల్లో కాసిన్ని నీళ్ళ గొంతులో పోయ్యాలని. ఆయన

లేకపోయినా నేను వున్నాను. ఇంకో నాలుగైదు నెలలకి మీ మనవడో మనవరాలో ఉంటుంది. మీరు కూడా నన్ను అన్యాయం చేసిపోతే ఎలా?.... ఆయన ఆత్మకి శాంతి అయే లాగా మీకైనా సేవ చేసుకొనే అదృష్టం నాకు వుండ నియ్యండి. పుట్టబోయే మీ మనవడి కోసమేనా వుండి పోండి" ఏడుస్తూ దోసిలి ఒగ్గి ప్రార్థించింది సరోజ.

సోవన్నకీ సత్తెమ్మకీ గుండె చెరువైపోయింది. "ఉంటాం అమ్మా.... ఇక్కడే ఉంటాం.... రత్నంలాంటి కొడుకు పోనే పోయాడు. నీలాంటి బంగారు తల్లినికూడా ఎక్కడ పోగొట్టుకుంటాం? దేవుడు కొడుకుని తీసుకుపోయి ఒక కూతుర్ని ఇచ్చాడనుకుంటాం.... సరేనమ్మా సరే...." అంటూ అంత అంధకారంగా మారిన చీకట్లలోనూ ఏదో ఒక వెలుగు రేఖ మీద ఆశపెట్టుకుని ఆ ముసలి జీవాలు రెండూ ఆగిపోయాయి. మూసుకున్న రెండు కళ్ళకోసం కన్నీళ్ళు కారుస్తూన్న ఆ ఆరుకళ్లూ, త్వరలో తెరుచుకునే రెండు కళ్ళమీద ఆశలు పెంచుకుంటూ రోజుల్ని భారంగా దొర్లిస్తున్నాయి.

( ఆంధ్రప్రభ )